

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL  ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి  ఆదివారం 08-02-2026  సంపుటి : 07  సంచిక 265  పేజీలు : 8  వెల : రూ 3-00


# భారత రైతులకు పూర్తి రక్షణ..


## ట్రేడ్ డీల్‌పై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూ ఢిల్లీ, అమెరికాతో ఇటీవల కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై కేంద్ర వాణిజ్య శాఖా మంత్రి పీయూశ్ గోయల్ స్పందించారు. ఈ ట్రేడ్ డీల్‌లో భారత రైతులకు, ఎమ్ఎస్ఎమ్ఈ పరిశ్రమలకు పూర్తి రక్షణలు కల్పించామని చెప్పారు. అదే సమయంలో భారత వ్యవసాయ ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేసేందుకూ అవకాశం దక్కిందని అన్నారు. ఎర్రజొన్నలు, వైన్స్, స్పిరిట్స్ వంటి కొన్ని ఎంపిక చేసిన అమెరికా ఉత్పత్తులను మాత్రమే భారత్‌లోకి అనుమతించినట్టు తెలిపారు. పూర్తిస్థాయి ఒప్పందంపై మార్చ్‌లో భారత్, అమెరికా సంతకాలు చేస్తాయని తెలిపారు. ఆ తరువాత 30 ట్రిలియన్ డాలర్ల అమెరికా మార్కెట్‌లోకి భారత ఎగుమతిదారులకు అవకాశం లభిస్తుందని వివరించారు. ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌పై సుంకాలు తక్కువని తెలిపారు ఇరు దేశాల మధ్య కుదిరిన ఉమ్మడి కార్యాచరణ ప్రకారం, భారత్‌పై ప్రతీకార సుంకం 18 శాతానికి తగ్గిందని చెప్పారు. అదనంగా విధించిన 25 శాతం సుంకాన్ని కూడా అమెరికా ఉపసంహరించుకుందని చెప్పారు. 'మన ఉత్పత్తులపై సుంకం 18 శాతం. ఇది పొరుగు దేశాలతో పోలిస్తే మెరుగు' అని తాజాగా నిర్వహించిన పత్రికా సమావేశంలో కేంద్ర మంత్రి తెలిపారు. చైనా వస్తువులపై 35 శాతం, వియత్నాం, బంగ్లాదేశ్ వస్తువులపై 20 శాతం, ఇండోనేషియా వస్తువులపై 19 శాతం చొప్పున అమెరికా సుంకాలు విధిస్తోందని అన్నారు. భారత ఎగుమతిదారులు అనేక వస్తువులను ఎలాంటి సుంకాల బెడద లేకుండా అమెరికాకు ఎగుమతి చేయొచ్చని చెప్పారు. పలు వ్యవసాయ ఉత్పత్తులపై కూడా ఎలాంటి సుంకాలు ఉండని చెప్పారు. మసాలాదినుసులు, టీ, కాఫీ, కొబ్బరి నూనె, జీడిపప్పు, పలు రకాల పండ్లు, కూరగాయాలను సుంకాల బెడద లేకుండా అమెరికాకు ఎగుమతి చేసుకోవచ్చని మంత్రి వివరించారు. భారత వ్యవసాయ రంగానికి రక్షణ కల్పించామని కూడా మంత్రి వివరించారు. విదేశీ ఉత్పత్తులకు భారత వ్యవసాయ రంగం తలుపులను పూర్తిగా తెరవలేదని భరోసా ఇచ్చారు. భారత దేశం స్వయం సమృద్ధి సాధించిన వ్యవసాయ ఉత్పత్తులను ట్రేడ్ డీల్ పరిధిలోకి తేలేదని వివరించారు. మాంసం, పౌల్ట్రీ, డెయిరీ, సోయాబీన్, మొక్కజొన్న, వరి, గోధుమలు, చక్కెర, జొన్నలు, రాగులు వంటి చిరుధాన్యాలు వంటివి అమెరికా నుంచి తక్కువ టారిఫ్‌లకు భారత్‌లోకి అనుమతించబోమని చెప్పారు. గ్రీన్ టీ, కాబూలీ శనగలు, పల్లీలు, మాల్ట్, మాల్ట్ ఆధారిత ఉత్పత్తులకు కూడా ఈ ట్రేడ్ డీల్‌లో ఎలాంటి మినహాయింపులు ఇవ్వలేదని వివరించారు. 'భారత రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉండే కొందరు ఈ ట్రేడ్ డీల్‌ను చూసి ఆశ్చర్యపోతున్నారు' అని వాణిజ్య శాఖా మంత్రి పీయూష్ గోయల్ కామెంట్ చేశారు.



## శ్రీశైలం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు

# సీఎం చంద్రబాబుకు ఆహ్వానం



నంద్యాల, ఫిబ్రవరి 7: శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు సీఎం చంద్రబాబును ఆహ్వానించారు ఆలయ అధికారులు. శనివారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, ఆలయ ఛైర్మన్ రమేశ్ నాయుడు, ఈవో శ్రీనివాసరావులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలను ఆయనకు అందజేశారు అర్చక స్వాములు.శ్రీశైలంలో రేపటి(ఫిబ్రవరి 8) నుంచి ఈనెల 18 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు 11 రోజుల పాటు ఘనంగా జరగనున్నాయి. గతేడాది కంటే ఈ సంవత్సరం ఎక్కువ మంది భక్తులు తరలివచ్చే అవకాశముందని ఆలయ అధికారులు అంచనా వేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఈ నెల 13 నుంచి నాలుగు రోజుల పాటు ప్రతి భక్తునికి ఉచితంగా లడ్డూ ప్రసాదం అందించనున్నట్లు ఈవో తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మొత్తం 40 లక్షల లడ్డూ ప్రసాదాలు తయారు చేయిస్తున్నట్లు ఆయన తెలిపారు. బ్రహ్మోత్సవాల సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఈనెల 14, 15న టోల్ గేట్ల వద్ద టోల్ ఫీజు లేకుండా వాహనాలను అనుమతిస్తున్నట్లు చెప్పారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా.. రోజుకు మూడు స్లాట్లలో మాత్రమే వీఐపీ దర్శనాలకు అనుమతిస్తామని తెలిపారు. భక్తుల రద్దీ కారణంగా రేపటి నుంచి 20వ తేదీ వరకు మల్లికార్జున స్వామివారి స్పర్శ దర్శనం నిలిపివేస్తున్నట్టు ఈవో శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

# సమాజానికి ఉపయోగపడేలా విద్యార్థులు ఎదగాలి: వెంకయ్యనాయుడు

విశాఖపట్నం, ఫిబ్రవరి 7: పెందుర్తిలోని బాలాజీ హై ఫీల్డ్స్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాసంస్థల్లో పిల్లలకు విద్యతో పాటు సంస్కారాన్ని కూడా నేర్పించాలని అన్నారు. పిల్లలను సంస్కారవంతులుగా తీర్చిదిద్దే బాధ్యత విద్యాలయాలపై ఉందన్నారు. చదువు అంటే కేవలం ఉద్యోగం సంపాదించడమే కాదని, సమాజానికి ఉపయోగపడే మంచి వ్యక్తులుగా విద్యార్థులు ఎదగాలని సూచించారు. అభివృద్ధి అంటే భవనాలు కట్టడం మాత్రమే కాదని, ప్రకృతిని కాపాడుకునే బాధ్యత కూడా అందరిపై ఉందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం.. భారతదేశమని అన్నారు వెంకయ్యనాయుడు. ఈ మధ్యకాలంలో కొంతమంది నాయకులు విర్రవీగుతూ బూతులు తిడుతున్నారని విమర్శించారు. అలాంటి వారికి ప్రజలు పోలింగ్ బూత్‌లోనే తగిన సమాధానం చెప్పాలన్నారు. రాజకీయ నాయకులకు బూతులు మాట్లాడటం ఒక ఫ్యాషన్‌లా మారిపోయిందని మండిపడ్డారు. ఎంత ఎక్కువ బూతులు మాట్లాడితే అంత పబ్లిసిటీ వస్తుందని కొందరు భావిస్తున్నారని విమర్శించారు. రాజకీయ నాయకులు అందరికీ ఆదర్శంగా ఉండాలని మాజీ ఉపరాష్ట్రపతి సూచించారు



# రాజధాని అభివృద్ధికి కేంద్రం పూర్తి సహకారం: రామ్మోహన్ నాయుడు



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 7: కేంద్ర బడ్జెట్‌ను ప్రజల్లోకి తీసుకెళున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం కేంద్ర బడ్జెట్ 2026-27పై మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ బడ్జెట్ ఎన్నికల బడ్జెట్ కాదని, రాజకీయాలు పక్కనపెట్టి 140 కోట్ల మంది భారతీయుల కోసం బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. 2014కు ముందు ప్రపంచంలో అత్యంత బలహీన దేశాల్లో భారత్ ఒకటిగా ఉండేదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఇప్పుడు నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగిందని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదో సారి బడ్జెట్ ప్రవేశపెట్టారని తెలిపారు. 7 శాతం వృద్ధి రేటు సాధించేందుకు తయారీ రంగంపై ప్రధానంగా దృష్టి పెట్టారని అన్నారు. ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించేందుకు ఏపీకి కేంద్రం సహకరిస్తుందని వెల్లడించారు. గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నామని.. ప్రపంచ దేశాలు భారత్‌తో కలిసి పనిచేయడానికి ముందుకు వస్తున్నాయని కేంద్రమంత్రి వెల్లడించారు. గతంలో దేశవ్యాప్తంగా 74 ఎయిర్‌పోర్టులు మాత్రమే ఉండగా, ప్రస్తుతం 164కు పెంచామని కేంద్రమంత్రి చెప్పారు. విమానాల తయారీకి బడ్జెట్‌లో అవకాశాలు కల్పించామని తెలిపారు. ఏపీలో తాగునీటి అవసరాల కోసం రూ.840కోట్లు కేటాయించారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం రూ.13 వేల కోట్లు కేంద్రం కేటాయించిందని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. విశాఖ రైల్వే జోన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం 52 ఎకరాల భూమి కేటాయించిందని, పనులు వేగవంతంగా జరుగుతున్నాయని కేంద్రమంత్రి చెప్పారు. 2026 బడ్జెట్‌లో ఏపీకి అనేక కేటాయింపులు జరిగాయన్నారు. ఏపీలో నూతన రైల్వే ప్రాజెక్టుల కోసం రూ.10,134 కోట్లు ప్రకటించారని, అమరావతి కోసం రూ.1,120 కోట్లు కేటాయించారని వివరించారు. అమరావతిలో ఇప్పుడు 24 గంటలూ పనులు జరుగుతున్నాయని కేంద్రమంత్రి రామ్మోహన్ తెలిపారు. కేంద్ర సహకారంతోనే గత 20 నెలల్లో కూటమి ప్రభుత్వం అనేక విజయాలు సాధించిందన్నారు. ఈ విజయాలు మరో 20 సంవత్సరాలు కొనసాగాలని ఆకాంక్షించారు. 'పండ్లు కాసే సమయంలో కసాయి వాడికి అప్పగించవద్దు' అని అన్నారు. రాష్ట్రానికి బలమైన పునాదులు పడుతున్నాయని వ్యాఖ్యానించారు. గతంలో రాజధాని అంటే చెప్పుకోలేకపోయామన్నారు రామ్మోహన్ నాయుడు.






# కల్తీ నెయ్యి అంశంపై వీడియో పోస్ట్ చేసిన పవన్ కళ్యాణ్

అమరావతి, ఫిబ్రవరి 7: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో ఉపయోగించిన నకిలీ నెయ్యి వివాదంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒక వీడియో విడుదల చేశారు. సోషల్ మీడియా మాధ్యమం 'ఎక్స్' ఖాతాలో సదరు వీడియో పోస్ట్ చేశారు. తిరుమల లడ్డూ తయారీకి ఉపయోగించిన కల్తీ నెయ్యి అంశంపై సీబీఐసిట్‌దర్యాప్తు నివేదికల గురించి పవన్ ఈ వీడియోలో వివరించారు. ఈ అంశం రాజకీయాలకు లేదా ఏ మతాన్నీ లక్ష్యంగా చేసుకోవడానికి సంబంధించినది కాదన్న పవన్.. ఇది విశ్వాసం, జవాబుదారీతనానికి సంబంధించినదని అన్నారు. ఈ విషయంలో ప్రమేయం ఉన్నవారిని



చట్ట ప్రకారం జవాబుదారీగా చేస్తారని.. న్యాయం జరిగే వరకూ ఎన్డీఏ ప్రభుత్వం ఈ విషయాన్ని కొనసాగిస్తుందని పవన్ తన వీడియో సందేశంలో పేర్కొన్నారు.

# సంపాదకీయం

ఆదివారం 08-02-2026

## ఎప్‌స్టీన్ ఫైల్స్.. అంతులేని కథ

ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన జెఫ్రీ ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం సెగలు ఇప్పుడు ఒక్కొక్క దేశాన్ని తాకుతున్నాయి.. అమెరికాలో సంచలనం సృష్టించిన జెఫ్రీ ఎప్‌స్టీన్ కేసులోని రహస్య పత్రాలను 'ఎప్‌స్టీన్ ఫైల్స్' అంటున్నారు. ఇటీవల అమెరికా ప్రభుత్వం ఈ పత్రాలను బహిర్గతం చేయడంతో ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఎప్‌స్టీన్ అమెరికన్ బిలియనీర్. మైనర్ బాలికలను లైంగిక అక్రమ రవాణా చేసినట్లు నిర్ధరణ అయింది. 2019లో ఎప్‌స్టీన్ జైలులో ఉండగానే ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సేకరించిన కోర్టు పత్రాలు, సాక్ష్యాలు, విమాన ప్రయాణ వివరాలు, కాంటాక్ట్ లిస్టులను ప్రభుత్వం విడతల వారీగా విడుదల చేస్తూ వస్తోంది. అమెరికా, బ్రిటన్ ఇలా ఎన్నో దేశాలను వణికిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లోని కుబేరుల్ని సైతం షేక్ చేస్తున్న అంశం ఎప్‌స్టీన్ ఫైల్స్. చాలా ఏళ్లుగా ఈ విషయంలో చర్చ జరుగుతూనే ఉన్న.. ఇటీవల వరుసగా ఇందులోని విషయాలు బయటకు వచ్చాయి. అప్పటివరకు వీటి గురించి బహిరంగంగా మాట్లాడని సెలబ్రిటీలు, సెలబ్రిటీలు భార్యలు కూడా ఇప్పుడు మాట్లాడుతున్నారు. ఇప్పుడు ఈ రొచ్చు బాలీవుడ్‌కి తాకింది. హిందీ సినిమాకు చెందిన ఇద్దరి పేర్లు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉన్నాయంటూ ప్రచారం జరుగుతోంది. వారే దర్శక నటుడు అనురాగ్ కశ్యప్, దీపక్ చోప్రా. దీంతో ఇప్పుడు బాలీవుడ్‌లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ఓ ఈవెంట్ కోసం అనురాగ్ కశ్యప్ 2017లో బీజింగ్ వెళ్లారంటూ పుకార్లు వచ్చాయి. వీటిపై అనురాగ్ కశ్యప్ స్పందించి ఖండించారు. "వక్తగా నాకు నెలకు చాలా ఆహ్వానాలు వస్తుంటాయి. అరుదుగా వాటిపై స్పందిస్తుంటా. అయితే నా జీవితంలో ఇప్పటివరకూ బీజింగ్ వెళ్లలేదు" అని క్లారిటీ ఇచ్చేశారు. ఇక దీపక్ చోప్రా మాట్లాడుతూ నేనెప్పుడూ నేరపూరిత కార్యకలాపాల్లో భాగం కాలేదు. ఎప్‌స్టీన్‌తో నా పరిచయం పరిమితమైనది. వివాదాస్పద లైంగిక నేరాల ఘటనతో నాకు సంబంధం లేదు అని చెప్పేశారు. అయితే ఈ పత్రాల్లో ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తుల పేర్లు ఉండటం కలకలం రేపుతోంది. అయితే, ఒక వ్యక్తి పేరు ఈ ఫైల్స్‌లో ఉన్నంత మాత్రాన అతను నేరం చేసినట్లు కాదు. కొందరు కేవలం ఆయనకు తెలిసిన వారు, లేదంటే ఆయన విమానంలో ప్రయాణించిన వారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఫైల్స్‌ను పూర్తిగా విడుదల చేసేందుకు ఉద్దేశించిన బిల్లుపై ఇటీవల సంతకం చేశారు. దీనివల్ల దాదాపు 30 లక్షల పేజీల డాక్యుమెంట్లు, 2 వేల వీడియోలు బయటకు వచ్చే అవకాశం ఉంది. అప్పుడు ఇంకా చర్చ జరుగుతుం ప్రభుత్వాన్ని తాకాయి. ఇప్పటికే ఎప్‌స్టీన్‌తో సంబంధాలపై బిల్‌గేట్స్ స్పందించి.. బాధితులకు క్షమాపణలు చెప్పగా.. ఇప్పుడు బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ అందరికీ సారీ చెప్పారు. ముఖ్యంగా ఎప్‌స్టీన్‌తో అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు ఎదుర్కొంటున్న పీటర్ మాండెల్సన్‌ను గతంలో అమెరికాకు బ్రిటన్ రాయబారిగా నియమించినందుకుగాను ఆయన పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. ఎప్‌స్టీన్ బాధితులకు జరిగిన అన్యాయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన ఈ క్షమాపణలు తెలిపారు. అమెరికాలో బ్రిటన్ రాయబారి వంటి అత్యంత కీలకమైన పదవిని పీటర్ మాండెల్సన్‌కు కట్టబెట్టడం అప్పట్లో పెద్ద చర్చకు దారితీసింది. అయితే మాండెల్సన్ తనవద్ద అబద్ధాలు చెప్పి ఆ పదవిని దక్కించుకున్నారని ప్రధాని కీర్ స్టార్మర్ ఆరోపించారు. జెఫ్రీ ఎప్‌స్టీన్ తనకు అంతగా పరిచయం లేని వ్యక్తి అని, అతనితో ఎలాంటి లోతైన సంబంధాలు లేవని మాండెల్సన్ నమ్మించారని ప్రధాని వెల్లడించారు. ఆయన మాటలను నమ్మి చేసిన నియామకం ఇప్పుడు ప్రభుత్వానికి తలవంపులు తెచ్చిందని స్టార్మర్ అంగీకరించారు. పీటర్ మాండెల్సన్ 2024 డిసెంబరులో రాయబారిగా బాధ్యతలు చేపట్టారు. అయితే 2008లోనే ఎప్‌స్టీన్ లైంగిక నేరాల కేసులో దోషిగా తేలినప్పటికీ.. మాండెల్సన్ ఆయనతో స్నేహాన్ని కొనసాగించినట్లు కొన్ని ఈమెయిల్స్, మరికొన్ని పత్రాలు బయటకు వచ్చాయి. ఇలా వీరిద్దరి మధ్య ఉన్న సంబంధంలోని చీకటి కోణాలు వెలుగులోకి రావడంతో స్టార్మర్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెరిగింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే గతేడాది సెప్టెంబరులో ప్రధాని కీర్ స్టార్మర్ పీటర్ మాండెల్సన్‌ను పదవి నుంచి తొలగించారు. అమెరికా ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన మరిన్ని పత్రాలు మాండెల్సన్ చుట్టూ ఉచ్చును మరింత బిగించాయి. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభం సమయంలో బ్రిటన్ ప్రభుత్వానికి సంబంధించిన కొన్ని అత్యంత సున్నితమైన సమాచారాన్ని మాండెల్సన్ ఎప్‌స్టీన్‌తో పంచుకున్నట్లు ఈ పత్రాలు తెలుపుతున్నాయి. దేశ ప్రయోజనాలకు భంగం కలిగించేలా ఒక లైంగిక నేరగాడితో సమాచారాన్ని పంచుకోవడం బ్రిటన్ రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. కేవలం స్నేహం మాత్రమే కాకుండా.. వీరి మధ్య ఆర్థిక లావాదేవీలు కూడా జరిగినట్లు ఆధారాలు లభ్యం అయ్యాయి. 2003-2004 మధ్యకాలంలో పీటర్ మాండెల్సన్, ఆయన భాగస్వామి రీనాల్డో అవిలా ద సిల్వాకు సంబంధించిన బ్యాంకు ఖాతాలకు ఎప్‌స్టీన్ సుమారు 75 వేల డాలర్ల (భారత కరెన్సీలో సుమారు రూ. 63 లక్షలకు పైగా) మేర చెల్లింపులు చేశాడని వెల్లడి అయింది. ఇంతటి నేర చరిత్ర ఉన్న వ్యక్తితో ఆర్థిక సంబంధాలు కలిగి ఉండి కూడా, రాయబారిగా కొనసాగడం బాధితులను మరింత ఆవేదనకు గురిచేసిందని ప్రధాని పేర్కొన్నారు. ఎప్‌స్టీన్ ఫైళ్లలో విడుదలైన నగ్న ఫోటోలు, వీడియోలు బ్లర్ చేయకుండా చాలా రోజులుగా ఆన్‌లైన్‌లో ఉన్నాయి.

# పట్టించుకోని ప్రభుత్వం..

## పూడిక తీత పనులు మొదలుపెట్టిన రైతులు



రాయపోల్, ఫిబ్రవరి 07 : పంటలు ఎండిపోయే పరిస్థితి ఉన్నా కాలువలో ఉన్న తుంగ, పూడికను ఎత్తివేయడాన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతులే రంగంలోకి దిగారు. రైతులంతా చేయి చేయి కలిపి పూడిక తీత పనులు షురూ చేసి స్ఫూర్తిగా నిలిచారు.. పెద్దగా సాగునీటి వనరులు లేని సిద్ధిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలో కొండపోచమ్మ, మల్లన్న సాగర్ ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందుతుంది.. కేసీఆర్ హయాంలో ప్రాజెక్టుల నిర్మాణంతోపాటు ప్రధాన కాలువలు, పలు ప్రాంతాల్లో ఉప కాలువల నిర్మాణం చేసుకొని గోదావరి జలాలు కూడా విడుదల చేసుకోవడం జరిగింది.. అయితే గత రెండేళ్లుగా కాలువల్లో పూడిక తీయకపోవడంతో తుంగ, పూడిక పేరుకపోయింది. దీంతో కాలువలో నీళ్లు వెళ్లడానికి అడ్డంకిగా మారడంతో కాలువలు తెగిపోతున్నాయి.. కాలువ సమస్యలతో ఇబ్బంది పడుతున్నా అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు..యాసంగిలో కాలువ, చెరువు కుంటల ఆధారంగా పెద్ద ఎత్తున పంటలు సాగుచేశారు.. నేడు నీళ్లు అడుగంటడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కొండపోచమ్మ ప్రాజెక్టులోని 13టకాలువకు సంబంధించిన మంతూర్, వెంకట్రావుపేట, లింగాపూర్, ఎల్ బంజేరు పల్లి, ముత్యంపేట, సూరంపల్లి, దొమ్మాట, గాజులపల్లి, జంగపల్లి, అల్మాజీపూర్ తదితర గ్రామాల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు సమావేశం నిర్వహించి ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. కాలువ పూడిక తీయించి ఆదుకోవాలని వేడుకున్నారు. మంత్రి స్పందించకపోవడంతో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి తనవంతు సహకారం అందిస్తానని భరోసా ఇవ్వడంతో రైతులు లాంగ్ భూమ్ ప్రొక్లైనర్ లు రెండు తెప్పించి మంతూర్- అనాజీపూర్ మధ్య కాలువ పనులు ప్రారంభించారు.. గత సంవత్సరం కూడా రైతులమే కాలువ పూడిక తీసి నీళ్లు తీసుకెళ్లామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కట్టిన ఇఌ పెట్టిన పొయ్యి అన్నట్టుగా ఉన్న ప్రాజెక్టు కాలువకు పూడిక తీయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాలువ పూడికతీతకు నిధులు మంజూరు చేయాలని రైతులంతా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మంతూర్ సర్పంచ్ పర్వేజ్ అహ్మద్, ఉప సర్పంచ్ సంతోష్, దొమ్మాట మాజీ సర్పంచ్ పూజిత వెంకట్ రెడ్డి, గాజులపల్లి సర్పంచ్ స్వామి, తొగుట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## రోడ్డు పొక్కల్లో ఇంత డాంబర్ వేసే తెలివి లేని దద్దమ్మలు కాంగ్రెస్ పాలకులు.. గజ్వేల్‌లో హరీశ్‌రావు సెటైర్లు



హైదరాబాద్, ఫిబ్రవరి 8, రెండున్నరేండ్ల కాంగ్రెస్ పాలనలో పాలు, నీళ్లు ఏమిటో ప్రజలకు అర్థమైందని డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు అన్నారు. ఎవర్ని అడిగినా రేవంత్ పాలన ఎలా ఉందో చెబుతున్నారని తెలిపారు. గజ్వేల్ మున్సిపాలిటీలో శనివారం నాడు హరీశ్‌రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందిరాపార్క్, ఎంపీడీవో చౌరస్తా వద్ద నుంచి రోడ్ షోలో ప్రసంగించారు. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. జానెడు సీసీ రోడ్డు పోయలేదని.. మోరీ కట్టలేదని.. కనీసం ఒక్క రూపాయి పని కూడా గజ్వేల్‌లో చేయలేదని విమర్శించారు. గజ్వేల్ అభివృద్ధి చేసిందు అని కేసీఆర్ ను ప్రతిపక్షాలు తిట్టినయి. మరి కేసీఆర్‌ను మనం కడుపులో పెట్టుకోవాలన్నా వద్దా? అని ప్రశ్నించారు. ఒకప్పుడు గజ్వేల్‌కు ఉత్తరం పోస్టు చేస్తే గద్వాలకు పోయేదని సమైక్యాంధ్రలోని దీనస్థితిని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు గజ్వేల్ అంటే అభివృద్ధిలో జిగేల్ అని అన్నారు. కేసీఆర్ గజ్వేల్ గౌరవం పెంచాడని కొనియాడారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా కాంగ్రెస్ నాయకులపై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. రోడ్డు పొక్కల్లో ఇంత డాంబర్ వేసే తెలివి లేని దద్దమ్మలు కాంగ్రెస్ పాలకులని విమర్శించారు. వీళ్లకు గజ్వేల్ లో ఓటు కావాలని తిరుగుతున్నారని మండిపడ్డారు. గజ్వేల్‌లో కేసీఆర్‌ను ఓడగొట్టాలని రేవంత్ రెడ్డి కట్టలు కట్టలు పంపాడట అని ఆరోపించారు. ఆ పైసలు మనల్ని కొట్టి కమాయించినవే.. ఎవరు ఎన్నిఇచ్చినా అవే మా పైసలే అనుకొని తీసుకోవాలని సూచించారు. కానీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు ఓటు గుద్ది కాంగ్రెస్ కు గుణపాఠం చెప్పాలె అని పిలుపునిచ్చారు.

## ఏ ఫైల్స్ తగలబడ్డాయో ఇంకా స్పష్టత లేదు..

### ఫోరెన్సిక్ ల్యాబ్ ఫైర్ యాక్సిడెంట్‌పై డీసీపీ శిల్పవల్లి

హైదరాబాద్ నాంపల్లిలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి స్పందించారు. నేర పరిశోధనకు సంబంధించిన ఫైల్ ఎవిడెన్స్ ల్యాబరేటరీ మొత్తం ఇక్కడి నుంచే ఆపరేషన్ జరుగుతుందని తెలిపారు. ఈ ల్యాబ్‌లోని ఏ ఫైల్స్ తగలబడ్డాయో ఇంకా స్పష్టత రాలేదని పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగిందని డీసీపీ శిల్పవల్లి తెలిపారు. మొదటి అంతస్తులో పొగ రావడం గమనించిన ఆఫీస్ బాయ్.. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాడని పేర్కొన్నారు. అప్పటికి ఇంకా ఆఫీసు పూర్తిగా ఓపెన్ కాకపోవడంతో కేవలం నలుగురు సిబ్బంది మాత్రమే ఉన్నారని.. వారంతా బయటకు వచ్చేశారని చెప్పారు. ఫైర్ యాక్సిడెంట్‌పై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని ఐదు ఫైరింజన్లతో మంటలను ఆర్పివేశారని తెలిపారు. ప్రస్తుతం మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయని పేర్కొన్నారు. ఇంకా లోపలికి వెళ్లడానికి కుదరడం లేదని.. ల్యాబ్‌లో ఏ ఫైల్స్ తగలబడ్డాయో ఇంకా స్పష్టత రాలేదని చెప్పారు. నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఈూఒ)లో శనివారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ల్యాబ్‌లోని మొదటి అంతస్తులో ఉన్న కంప్యూటర్ ల్యాబ్‌లో తొలుత మంటలు చెలరేగాయి. నిమిషాల వ్యవధిలోనే మంటలు భవనంలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించాయి. దీంతో లోపల ఉన్న కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయి. అగ్నిప్రమాదం కారణంగా ఆ ప్రాంతమంతా దట్టంగా నల్లటి పొగ అలుముకుంది. ప్రమాదాన్ని గమనించిన కార్యాలయ సిబ్బంది ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. అగ్ని ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని ఐదు ఫైరింజన్లతో మంటలనున అదుపులోకి తీసుకొచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని అధికారులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. కాగా, ప్రమాదం గురించి తెలియగానే నార్త్ జోన్ డీఐజీ శ్వేత, ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి ల్యాబ్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ల్యాబ్‌లో కీలకమైన కేసులు, ఫోరెన్సిక్ ఆధారాలకు సంబంధించిన డాక్యుమెంట్లు ఏవైనా దెబ్బతిన్నాయా అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు. కాగా, ఈ అగ్ని ప్రమాదంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఓటుకు నోటు కేసు సహా పలు కీలక కేసులకు సంబంధించిన డాక్యుమెంట్లు, ఎవిడెన్స్‌లు ఇక్కడే ఉండటంతో ఈ అగ్ని ప్రమాదం వెనుక కుట్ర కోణం ఉండొచ్చని అంటున్నారు.





## రష్యాతో ఆయిల్ కొనుగోళ్లు తగ్గించిన ఇండియా.. టారిఫ్‌లు తగ్గించిన ట్రంప్



భారత్‌పై విధించిన సుంకాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తగ్గించారు. ఈ మేరకు టారిఫ్‌లు తగ్గిస్తూ ట్రంప్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నిర్ణయం శుక్రవారం అర్ధరాత్రి నుంచి అమలులోకి వచ్చింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయబోమని ఇండియా హామీ ఇచ్చిన నేపథ్యంలో టారిఫ్‌ల తగ్గింపు నిర్ణయాన్ని అమెరికా అమలు చేస్తోంది. రష్యా నుంచి నేరుగా కానీ, లేదా పరోక్షంగా కానీ చమురు కొనబోమని ఇండియా హామీ ఇచ్చిందని ట్రంప్ ప్రకటించాడు. ఇటీవలి కాలంలో ఇండియా.. రష్యా నుంచి చమురు కొనుగోలు తగ్గించినట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు అమెరికా నుంచి చమురు సహా ఎనర్జీ సంబంధిత ఉత్పత్తులు కొనుగోలు చేస్తామని కూడా ఇండియా హామీ ఇచ్చింది. కొత్త టారిఫ్‌లు అమలులోకి రావడంతో ఇకపై ఇరు దేశాల మధ్య ఉత్పత్తులపై 18 శాతం మాత్రమే పన్నులు ఉంటాయి. ఇది దేశీయ ఎగుమతి దారులకు, తయారీదారులకు మేలు చేస్తుందని భారత్ భావిస్తోంది. అమెరికా నుంచి ఇండియా 500 బిలియన్ డాలర్ల ఉత్పత్తుల్ని దిగుమతి చేసుకోనుంది. అలాగే భారత ఎగుమతిదారులకు 30 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ అందుబాటులోకి వస్తుంది. ఇది చరిత్రాత్మక విజయం అని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. మరోవైపు తాజాగా ఇరు దేశాల మధ్య జరిగిన ఒప్పందం అమలులోకి రావడంపై ప్రధాని మోదీ స్పందించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు కృతజ్ఞతలు తెలిపారు. ఇది ఇరు దేశాలకు మంచి శుభవార్త అని, రెండు దేశాల మధ్య బలమైన సంబంధాల కోసం వ్యక్తిగత నిబద్ధతతో కృషి చేసిన ట్రంప్‌నకు థాంక్స్ అని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ డీల్ ఇండియాలోని రైతులు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు, మత్స్యకారులకు కొత్త అవకాశాల్ని సృష్టిస్తుందని అభిప్రాయపడ్డారు. మేకిన్ ఇండియా లక్ష్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని, మహిళలు, యువతకు భారీ ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మోదీ అభివర్ణించారు.


## కోరుట్లలో ఖాకీల కర్కశం.. మంత్రి ఉత్తమ్ ప్రసంగం కోసం శవయాత్రను అడ్డుకున్న పోలీసులు



కోరుట్ల :జగిత్యా జిల్లా కోరుట్ల పట్టణంలో రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరపాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి పర్యటనలో పోలీసుల ఓవరాక్షన్ చేశారు. మంత్రి ప్రసంగిస్తున్నారని అరగంట పాటు శవ యాత్రను అడ్డుకున్నారు. మృతురాలి బంధువులు అరగంట పాటు ఎండలో మృతదేహంతో రహదారిపై వేచివున్నారు. పట్టణానికి చెందిన కొమ్మనపల్లి శశికళ రాత్రి క్యాన్సర్ వ్యాధితో మృతి చెందింది. మృతదేహాన్ని ఊరేగింపుగా స్మశాన వాటికకు తీసుకెళుతున్న సందర్భంగా రహదారిపై మంత్రి ప్రసంగిస్తుండగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. ప్రసంగం పూర్తి అయ్యే వరకు అడ్డుగా నిలబడి శవ యాత్ర ను అడ్డుకోవడం విస్మయానికి గురి చేసింది. పాత్రికేయులు ఘటనా స్థలికి చేరుకునే సరికి పోలీసులు విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళ్లి, శవ యాత్రకు అనుమతిచ్చారు. పోలీసుల తీరుపై మృతురాలి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఎట్టకేలకు ఈఎన్సీని నియమించిన ప్రభుత్వం.. రమేశ్ బాబుకు అదనపు బాధ్యతలు

ఎట్టకేలకు తెలంగాణ ప్రభుత్వం నీటిపారుదల శాఖ ఈఎన్సీని నియమించింది. గత నెలలో పదవీ విరమణ పొందిన అంజద్ హుస్సేన్ స్థానంలో ఓలేటి వెంకట రమేశ్ బాబును నియమించింది. ఈ మేరకు నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇరిగేషన్ శాఖ ఈఎన్సీ నియమాకంపై ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వెంకట రమేశ్‌బాబుకు ఈఎన్‌సీగా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఆయన సూర్యాపేట, ఖమ్మం జిల్లాల చీఫ్ ఇంజినీర్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఇరిగేషన్‌లో ఈఎన్సీ(జనరల్) స్థానం అత్యంత కీలకం. గతంలో ఈ శాఖను 19 టెరిటోరియల్స్‌గా విభజించగా మైనర్, మీడియం, మేజర్ ప్రాజెక్టులన్నీ ఒకే గొడుగు కిందికి తీసుకొచ్చి ఆయా చీఫ్ ఇంజినీర్లకే బాధ్యతలను అప్పగించింది. అన్ని విభాగాలపై పూర్తిస్థాయి నిర్ణయాధికారాన్ని ఈఎన్సీకే కట్టబెట్టింది. ఇరిగేషన్ శాఖ, డ్యామ్ సేఫ్టీకి సంబంధించి రాష్ట్రస్థాయి కమిటీల్లోనూ ఈఎన్సీకే పూర్తి అధికారాలున్నాయి. ఇప్పటివరకు ఈఎన్సీగా పనిచేసిన అంజద్ హుస్సేన్ జనవరి 31న విరమణ పొందారు. సాధారణంగా కీలకమైన స్థానం ఖాళీ అవుతుంటే ముందుగానే తాత్కాలికంగానైనా ఇన్‌చార్జిని నియమించడం పరిపాటి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వారం రోజులైనా భర్తీ చేయకపోవడం ఇటీవల చర్చనీయాంశంగా మారింది.



# డ్రైవింగ్ లైసెన్స్ లో ఆటోమెటిక్ ట్రాకింగ్




విజయవాడ, ఫిబ్రవరి 8, ఏపీలో వాహనదారులకు బిగ్ అలర్ట్.. డ్రైవింగ్ లైసెన్సులు పొందటం ఇకపై అంత సులభం కాకపోవచ్చు. ఎందుకంటే ఏపీలో కొత్తగా నాలుగు ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ విధానంలో డ్రైవింగ్ లైసెన్స్ పొందడం అంత వీజీ కాదు. ఈ ట్రాకుల ఏర్పాటు కోసం ఏపీ ప్రభుత్వం మారుతి సుజుకీ ఇండియా మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం ఏపీలో నాలుగుచోట్ల మారుతీ సుజుకీ ఇండియా ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులు ఏర్పాటు చేయనుంది.ఆంధ్రప్రదేశ్‌లో వాహనదారులకు ముఖ్య గమనిక. ఏపీలో ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులు అందుబాటులోకి రానున్నాయి. మారుతీ సుజుకి ఇండియా.. ఏపీ ప్రభుత్వం కలిసి ఏపీలో నాలుగు ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులు ఏర్పాటు చేయనున్నారు. ఏలూరు, ఒంగోలు, విజయనగరం, అనకాపల్లి జిల్లాలలోని ఆర్టీవో కార్యాలయాల వద్ద ఈ ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేయనున్నారు. మారుతి సుజుకీ ఇండియా ఈ ట్రాకులను మూడేళ్లపాటు నిర్వహించనుంది. డ్రైవింగ్ మీద మంచి పట్టు వారే డ్రైవింగ్ లైసెన్సులు పొందేలా.. ఈ విధానం తీసుకువస్తున్నారు. దీంతో రాష్ట్రవ్యా?ప్తంగా రహదారి భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని భావిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా నాలుగు ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టు ట్రాకులు ఏర్పాటు, నిర్వహణ కోసం ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు మారుతి సుజుకీ ఇండియా శుక్రవారం ప్రకటించింది. ఏలూరు, విజయనగరం, ఒంగోలు, అనకాపల్లిలోని రీజినల్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసుల వద్ద వీటిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులను అందుబాటులోకి తెచ్చిన నాటి నుంచి మూడేళ్ల పాటు.. ఈ ట్రాకులకు కావాల్సిన ఆటోమేషన్, నిర్వహణ చూసేలాఏపీ ప్రభుత్వం మారుతి సుజుకీ ఇండియా మధ్య ఒప్పందం కుదిరింది. మరోవైపు ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులలో మానవ ప్రమేయం ఉండదు. నైపుణ్యం కలిగిన వ్యక్తులే డ్రైవింగ్ లైసెన్సులు పొందేలా ఈ విధానం అమల్లోకి తెస్తున్నారు.మరోవైపు ఈ నాలుగు ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులు ద్వారా లైట్ మోటార్ వెహికల్స్, టూవీలర్లకు డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేయనున్నారు. మరోవైపు ఒంగోలులో ఏర్పాటు చేసే ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ వద్ద హెవీ మోటార్ వాహనాలకు కూడా లైసెన్సులు జారీ చేయనున్నారు. మరోవైపు విశాఖపట్నంలో ఇప్పటికే ఇలాంటి ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ అందుబాటులోకి వచ్చింది. గంభీరమ్ వద్ద ఇలాంటి ట్రాక్ ఏర్పాటు చేశారు.ఈ విధానంలో సెన్సార్ల ద్వారా ఎలక్ట్రానిక్ విధానంలో డ్రైవింగ్ మీద పర్యవేక్షణ ఉంటుం ది. ట్రాక్ మొత్తం సెన్సార్లు ఏర్పాటు చేస్తారు. ఈ సెన్సార్లు వాహనం ప్రతి కదలికను పసిగడుతూ ఉంటాయి. ఏ మాత్రం తడబడినా పసిగట్టేస్తున్నాయి. దీంతో ఏ చిన్న తప్పు చేసినా డ్రైవింగ్ టెస్ట్ ఫెయిల్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. దీంతో డ్రైవింగ్ బాగా నేర్చుకున్నవారికే లైసెన్సులు వచ్చే అవకాశాలు ఉంటాయి.

# కాపు కాస్తామంటున్న వైసీపీ

## సామాజిక లెక్కల్లో జగన్ టీమ్

గుంటూరు, ఫిబ్రవరి 8,వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కొత్త రాజకీయ దారులను వెతుకుతున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆయన ఆలోచనలు సాధారణ విశ్లేషణలకు భిన్నంగా ఉంటాయని, ఓటమి తర్వాత మరింత జాగ్రత్తగా వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నారని అనుచరులు అంటున్నారు. రాజకీయాల్లో ఓడిన చోటే తిరిగి బలం పెంచుకోవడం ఒక సంప్రదాయం. జగన్ కూడా అదే మార్గాన్ని ఎంచుకుని, పాత పద్ధతులకు బదులుగా కొత్త వ్యూహాలపై నమ్మకం పెట్టుకున్నట్లు కనిపిస్తోంది. వైసీపీ ఓటమికి కారణమైన రాజకీయ, సామాజిక పరిణామాలను ఆయన లోతుగా అధ్యయనం చేస్తున్నారని ఇటీవల ఆయన ప్రసంగాలు సూచిస్తున్నాయి.ఈ వ్యూహాల్లో మాజీ మంత్రి అంబటి రాంబాబు) పాత్ర కీలకంగా మారుతోంది. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్నప్పటికీ ఆయనకు మంత్రి పదవి దక్కేందుకు మూడున్నర దశాబ్దాలు పట్టింది. వైఎస్సార్ అనుచరుడిగా కాంగ్రెస్‌లో పనిచేసినా, ఉమ్మడి ఏపీలో ఎమ్మెల్యేగా గెలవలేకపోవడం ఆయన రాజకీయ ప్రయాణాన్ని నెమ్మదింపజేసింది. అయితే వైసీపీ ఏర్పడ్డాక జగన్ ఆయనకు ప్రాధాన్యత ఇచ్చారు. 2022లో మంత్రి పదవి ఇవ్వడమే కాకుండా, తాజాగా కాపులలో "టైగర్" అంటూ బిరుదు ఇచ్చి ముందుకు తెచ్చారు.జగన్ రాజకీయ లెక్కల్లో కాపు సామాజిక వర్గం ముఖ్యంగా కనిపిస్తోంది. 2019 ఎన్నికల్లో వైసీపీ గెలుపులో వారి మద్దతు కీలకంగా నిలిచింది. అప్పట్లో ముద్రగడ పద్మనాభం (ఉద్యమం కూడా కలిసివచ్చి, గోదావరి జిల్లాలు ( వైసీపీకి బలంగా మారాయి. కానీ 2024 నాటికి పరిస్థితి పూర్తిగా మారింది. పవన్ కళ్యాణ్ రూపంలో కాపులకు బలమైన నాయకుడు రావడం, ఆయన చంద్రబాబు నాయుడుతో జట్టు కట్టడం వల్ల రాజకీయ సమీకరణలు తారుమారు అయ్యాయి. ఈ మార్పుతో వైసీపీకి ఎదురుదెబ్బ తగిలింది.ఈ నేపథ్యంలో అంబటి రాంబాబు ఘటనను జగన్ వ్యూహాత్మకంగా ఉపయోగించుకుంటున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. అంబటి కుమార్తె మౌనిక మీడియాతో మాట్లాడుతూ తమపై అధికార దుర్వినియోగం జరుగుతోందని ప్రశ్నించడం కాపు వర్గాల్లో చర్చకు దారి తీసింది. జనసేన మద్దతుతో అధికారంలోకి వచ్చిన టీడీపీ ) తమపైనే బలప్రయోగం చేస్తుందా అనే సందేహాన్ని ఆమె వ్యక్తం చేశారు. ఇది నేరుగా రాజకీయ నేతలకు కాకపోయినా, కాపు సమాజంలో భావోద్వేగాలను రేకెత్తించడానికే అన్న విశ్లేషణ ఉంది.గుంటూరు జిల్లా లో జగన్ పర్యటన సమయంలో కాపు జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో స్పందన కనిపించిందని అంటున్నారు. అంబటి రాంబాబు భవిష్యత్తులో తన సామాజిక వర్గాన్ని ఎంతవరకు పోలరైజ్ చేయగలుగుతారన్నది కీలక ప్రశ్నగా మారింది. వంగవీటి రంగా అనుచరుడిగా గతంలో కాపునాడు కార్యక్రమాల్లో పనిచేసిన నేపథ్యం ఆయనకు ఉంది. ఇప్పుడు వైసీపీ ఆయనను ముందుకు తెస్తూ కొత్త గుర్తింపునివ్వాలని చూస్తోంది. అంబటి విడుదల తర్వాత ఆయనకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలన్న ఆలోచన కూడా పార్టీ వర్గాల్లో ఉంది. కూటమి వర్సెస్ అంబటి అంశం రాబోయే రోజుల్లో మరింత వేడెక్కే అవకాశముంది. ఈ మొత్తం వ్యవహారంలో జగన్ వేసిన అడుగు వ్యూహాత్మకమా కాదా అన్నది రాజకీయ ఫలితాలే తేల్చాలి.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రమోషన్ పొందాలన్నా.. పదవులు దక్కించుకోవాలని అనుకున్నా ప్రత్యర్థి పార్టీల నాయకుల మీద బూతులతో విరుచుకుపడాలి. ఆయా పార్టీల నేతల ఇళ్లపై కర్రలతో దాడులకు దిగాలి. లేకుంటే నిత్యం జగన్మోహన్ రెడ్డికి వీర విధేయుడుగా ఉంటూ ఆయన నామస్మరణ చేయాలి. ఆయన అడుగులకు మడుగులు వత్తాలి. అప్పుడే వారికి పదవులు లభిస్తాయి. పిలిచి మరి పదవులు కట్టబెడతారు. వైయస్సార్ కాంగ్రెస్ ఐదేళ్ల హయాంలో జరిగింది కూడా అదే.ఏదైనా మంత్రి పదవి నిర్వర్తిస్తే వారి శాఖలో ప్రగతి చూస్తారు. కానీ వైసీపీ హయాంలో శాఖల ప్రగతి కంటే ప్రత్యర్థులపై బూతులతో విరుచుకుపడే మంత్రులే అధికం. కొడాలి నాని కి తొలి మూడేళ్లు పదవి ఇచ్చారు జగన్. చంద్రబాబుతో పాటు లోకేష్ పై విరుచుకు పడనిదే పొద్దు గడవదు అన్నట్టు ఉండేది కొడాలి నాని పరిస్థితి. ఆ స్థాయిలో జగన్మోహన్ రెడ్డిని మెప్పించారు కనుక కొడాలి నానికి మంత్రి పదవి దక్కింది. ఏకంగా పౌరసరఫరాల శాఖ మంత్రిగా అవకాశం కల్పించారు. అంతెందుకు జోగి రమేష్ విషయంలో కూడా అదే జరిగింది. ఆయన చంద్రబాబు ఇంటి మీదకు కర్రలతో దాడికి తెగబడినందుకే జోగి రమేష్ కు ఏకంగా గృహ నిర్మాణ శాఖ మంత్రిగా క్యాబినెట్ లో చోటు కల్పించారు జగన్మోహన్ రెడ్డి.సొంత సామాజిక వర్గాన్ని జగన్ కోసం కించపరిచారు పేర్ని నాని ఇక అంబటి రాంబాబు గురించి చెప్పనవసరం లేదు. అప్పటికీ ఇప్పటికీ ఆయన నోరు అదుపులోకి రావడం లేదు. పోసాని కృష్ణ మురళి అయితే పవన్ కళ్యాణ్ తో పాటు ఆయన కుటుంబాన్ని నీచాతి నీచంగా దూషించారు. ఏకంగా ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కించుకున్నారు.

# అనంత, శ్రీ సత్యసాయి జిల్లాలకు మహర్ధశ

అనంతపురం, ఫిబ్రవరి 8, ఇటీవల కేంద్రం రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్‌లను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ కారిడార్లలో ఏపీకి కూడా స్థానం దక్కింది. ఈ క్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో కూడా ఖరీదైన ఖనిజాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు అక్కడ ఖనిజాల కోసం అన్వేషణ జరుగుతోంది. ప్రస్తుతం అక్కడ సర్వేతో పాటుగా పరిశోధనలు చేపట్టారు. అలాగే కడప జిల్లాలో కూడా ఖనిజాలు ఉన్నాయి.రాయలసీమను రతనాల సీమగా పిలుస్తారు.. అంతటి పేరు పొందిన ప్రాంతంలో ఇప్పటికి వజ్రాల వేట జరుగుతోంది. వర్షాకాలంలో పొలాల్లో వజ్రాలు బయటపడుతుంటాయి. అయితే రాయలసీమలో రత్నాల కంటే ఖరీదైన ఖనిజ సంపద ఉందని తెలుస్తోంది. కేంద్రం ఇటీవల ప్రకటించిన రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్‌లో ఉమ్మడి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు స్థానం దక్కింది. ఈ మేరకు అక్కడ ఖనిజాల కోసం అన్వేషణ చేయనున్నట్లు తెలుస్తోంది.అనంతపురం జిల్లాలో 2023లో హైదరాబాద్‌కు చెందిన నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ పరిశోధనలు చేసింది. పలు ప్రాంతాల్లో కొన్ని ఖనిజాలు (నియోబియం, నియోడైమియం, సిరియం, లాంథనం, ప్రాసోడైమియం,స్కాండియం, జిక్రోనియం, లిథియం) ఉన్నట్లు గుర్తించారట. ఈ ఖనిజాలను ఎయిర్‌క్రాఫ్ట్స్, స్మార్ట్‌ఫోన్లు, విండ్ టర్బైన్స్, కంప్యూటర్లు వంటి వాటిలో కూడా ఉపయోగిస్తారని చెబుతున్నారు. లిథియం చాలా అరుదుగా దొరికే నిక్షేపాలలో ఒకటి.. తాడిమర్రి, తురకవారిపల్లి, దాడితోట ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారట. అనంతపురం జిల్లాతోపాటుగా కడప జిల్లాలో (పార్నపల్లె, లోపటనూతల) కూడా పరిశోధనలు చేయగా.. అక్కడ కూడా లిథియంను గుర్తించారట.ఈ లిథియంను ఎక్కువగా బ్యాటరీలలో వినియోగిస్తారు. అలాగే ఎలక్ట్రిక్ వాహనాలతో పాటుగా డిజిటల్ కెమెరాలు, మొబైల్స్ తయారీలో ఉపయోగిస్తారు. ఈ మేరకు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఈ ఖనిజాల కోసం చేస్తున్నారు. ఏఎండీ, జీఎస్ఐ, ఎన్‌జీఆర్ఐ క్షేత్రస్థాయిలో పరిశోధనలతో పాటుగా హెలికాప్టర్ సర్వే కూడా చేపట్టారు.కేంద్రం ఇటీవల రేర్ ఎర్త్ కారిడార్లకు సహకారం అందిస్తామని తెలిపింది. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్‌తో పాటుగా తమిళనాడు, ఒడిశా, కేరళ రాష్ట్రాలు ఉన్నాయి. సముద్ర తీరంలో బీచ్‌శాండ్ ఉన్నట్లు గుర్తించారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాల్లో కూడా అరుదైన ఖనిజాలు ఉన్నట్లు తేలింది. గతంలో విశాఖపట్నంతో పాటుగా తూర్పుగోదావరి జిల్లాల్లో పరిధిలో బాక్సైట్ నిల్వలు గుర్తించిన సంగతి తెలిసిందే. చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో బంగారం ఖనిజాన్ని గుర్తించిన సంగతి తెలిసిందే. వాటితో పాటుగా పైన తెలిపిన ఖనిజాలను కూడా గుర్తించారు. వీటి తవ్వకాలకు ముందుకొచ్చేవారికి కేంద్రం నుంచి ప్రోత్సాహం అందిస్తారు.

# హిందు ధర్మాన్ని భూజాన ఎత్తుకున్న టీడీపీ

కర్నూలు ఫిబ్రవరి 8, భారతీయ జనతా పార్టీతో సుదీర్ఘకాలం ప్రయాణిస్తూ వస్తోంది తెలుగుదేశం పార్టీ. అయితే ఎన్నడూ హిందుత్వ వాదాన్ని తెలుగుదేశం పార్టీ తెర ముందుకు తేలేదు. చంద్రబాబు సైతం ఎన్నడు మాట్లాడిన దాఖలాలు లేవు. తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నడూ కూడా హిందుత్వవాదంపై మొగ్గు చూపలేదు. కానీ ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని డిఫెన్స్ లో పడేయడానికి హిందూ ధర్మాన్ని భుజానికి ఎత్తుకున్నారు చంద్రబాబు. ఇది చంద్రబాబులో స్పష్టమైన మార్పు అని విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు. ఇంకోవైపు తిరుమల ఏడుకొండల వాడి ప్రతిష్టను తగ్గించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కుట్ర పన్నిందని కొత్త నినాదాన్ని అందుకున్నారు చంద్రబాబు. ఏపీలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా తిరుమల వెంకటేశ్వర స్వామికి కోట్లాదిమంది భక్తులు ఉన్నారు. ఇది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరింత ఇబ్బంది కలిగించే విషయమే.అయితే ఏపీలో కూటమి ఐక్యత లేకుండా పోతేనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అవకాశం దక్కుతుందని విజయసాయి రెడ్డి లాంటి వారు కూడా వ్యాఖ్యానించారు. కానీ ఎప్పుడైతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అటాక్ చేయడం ప్రారంభించిందో.. ఆ మూడు పార్టీల మధ్య బంధం మరింతగా పెరిగింది. ఈ రెండేళ్లలో తొలిసారి కూటమి నేతలు ఒకే వేదిక పైకి వచ్చారు. తిరుమల లడ్డు వివాదాన్ని తెరపైకి తీసుకురావడం తమకు కలిసి వచ్చే అంశంగా భావిస్తున్నారు. కూటమి ఐక్యత ఒకవైపు.. హిందుత్వవాదం ఇంకోవైపు.. గోవిందుడిపైనే కుట్రగా అభివర్ణించడం ద్వారా ఓటు బ్యాంకు ఏకీకరణ మరోవైపు అన్నది వ్యూహంగా కనిపిస్తోంది.ఆంధ్రప్రదేశ్ కు సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా వ్యవహరించారు చంద్రబాబుఉమ్మడి రాష్ట్రానికి 9 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్నారు.

# అఫెన్స్ మూడ్ లోకి కల్తీ నెయ్యి,...

విజయవాడ, ఫిబ్రవరి 8, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత కొద్దిరోజులుగా ప్రకంపనలు సృష్టిస్తున్న కల్తీ నెయ్యి వ్యవహారం, అనూహ్యంగా అధికార కూటమి పార్టీల మధ్య సరికొత్త ఐక్యతకు పునాది వేసింది. విపక్షాల విమర్శలు, సాంకేతిక అంశాల నడుమ కొంత డిఫెన్స్ ధోరణిలో ఉన్నట్లు కనిపించిన టీడీపీ, జనసేన, బీజేపీలు ఇప్పుడు ఎదురుదాడికి సిద్ధమయ్యాయి. తిరుమల లడ్డూ ప్రసాదం నెయ్యి కల్తీ వ్యవహారం ఇప్పుడు కేవలం ఒక ఆధ్యాత్మిక భావోద్వేగ అంశంగానే కాకుండా, రాజకీయ అస్తిత్వ పోరాటంగా మారింది. ఆరంభంలో ఈ విషయంలో కొంత తడబడినట్లు కనిపించిన అధికార కూటమి, ఇప్పుడు పూర్తిస్థాయి అప్రమత్తతతో విపక్షాలకు చెక్ పెట్టేందుకు సిద్ధమైంది.కల్తీ నెయ్యి అంశంలో సిట్ విచారణ, సుప్రీంకోర్టు వ్యాఖ్యలు, సీబీఐ ప్రమేయం వంటి అంశాలను అస్త్రాలుగా చేసుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దూకుడు పెంచింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలంటూ వైసీపీ చేస్తున్న డిమాండ్లు ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకట్ట వేయాలని కూటమి నిర్ణయించింది. కేవలం ప్రభుత్వపరంగానే కాకుండా, రాజకీయంగా కూడా గట్టి సమాధానం ఇవ్వకపోతే తప్పుడు సంకేతాలు వెళ్తాయని గ్రహించిన కూటమి నేతలు, గురువారం ఉమ్మడిగా మీడియా ముందుకు రావడం ఒక కీలక మలుపు.వైసీపీ చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు మూడు పార్టీల ప్రతినిధులతో కూడిన ఒక అంతర్గత సమన్వయ కమిటీని ఏర్పాటు చేయడం ఈ వ్యూహంలో అత్యంత కీలకమైన భాగం. క్షేత్రస్థాయిలో ప్రజలకు కల్తీ జరిగిన తీరును, గత ప్రభుత్వ హయాంలో జరిగిన టెండర్ల ప్రక్రియను వివరించాలని నిర్ణయించాయి. సిట్ విచారణలో వెల్లడవుతున్న కీలక అంశాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందుకు తీసుకురావాలని, సోషల్ మీడియాలో విపక్షాలు చేస్తున్న నెగటివ్ ప్రచారాన్ని మూడు పార్టీల ఐటీ విభాగాలు సమన్వయంతో తిప్పికొట్టాలని తీర్మానించాయి.ఈ అంశంలో పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్ష హిందూ ధర్మ పరిరక్షణ కోణంలో ప్రజల్లోకి బలంగా వెళ్లింది. దీనికి బీజేపీ జాతీయ స్థాయి మద్దతు కూడా తోడవడంతో, కూటమి మధ్య సైద్ధాంతిక



సారూప్యత మరింత పెరిగింది. చంద్రబాబు అనుభవం, పవన్ కల్యాణ్ భావోద్వేగ సందేశం, బీజేపీ జాతీయ అండదండలు కలగలిసి వైసీపీని రాజకీయంగా ఇరకాటంలోకి నెట్టేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి.సాధారణంగా కూటమి ప్రభుత్వాల్లో పార్టీల మధ్య చిన్నపాటి భేదాభిప్రాయాలు సహజం. కానీ, ఈ నెయ్యి కల్తీ వ్యవహారం ఆ గ్యాప్‌ను పూడ్చేందుకు ఉపయోగపడింది. విచారణ సంస్థల క్లీన్ చిట్ రాకముందే వైసీపీ హడావుడి చేస్తోందని, దీన్ని ఎదుర్కోవడంలో డైలమా వీడిపోయిందని స్పష్టమవుతోంది. ప్రభుత్వ గొంతు కంటే కూటమి గొంతు బలంగా వినిపిస్తేనే ఫలితం ఉంటుందని గుర్తించడం కూటమి పరిణతికి నిదర్శనం.మొత్తానికి, వైసీపీ విసిరిన సవాల్‌ను కూటమి పార్టీలు తమకు అనుకూలంగా మార్చుకున్నాయి. ఈ ఉమ్మడి పోరాటం కేవలం కల్తీ నెయ్యి అంశానికే పరిమితం కాకుండా, భవిష్యత్తులో ఇతర పాలనాపరమైన సవాళ్లను ఎదుర్కోవడానికి కూడా ఒక నమూనాగా మారే అవకాశం ఉంది. సమన్వయం మెరుగుపడడం వల్ల ఏపీ రాజకీయాల్లో కూటమి మరింత బలోపేతం కానుంది.ఢిల్లీలోని అరిస్టో కెమికల్స్ నుంచి భోలేబాబా డెయిరీ డైరెక్టర్లు దాదాపు 8,900 కిలోల లాక్టిక్ యాసిడ్, లబ్సాను కొనుగోలు చేసినట్లు ఆధారాలు దొరికాయి. పామాయిల్, పామ్ కెర్నెల్ ఆయిల్ వంటి చౌకరకం నూనెలకు ఈ రసాయనాలను కలిపితే, అవి అచ్చం నెయ్యికి ఉండే రంగు, రుచి, వాసనను సంతరించుకుంటాయి. ల్యాబ్ పరీక్షల్లో కూడా ఇది నెయ్యి అని నమ్మించేలా చేసేందుకు బీటా-కెరోటిన్ , ఎసిటిక్ యాసిడ్ ఈస్టర్ వంటి మిశ్రమాలను కూడా జోడించారు. దాదాపు 57.56 లక్షల కిలోల నూనెను ఇలా రసాయనాలతో కల్తీ చేసి తితిదేకు (తిరుమల తిరుపతి దేవస్థానం) నెయ్యి పేరుతో అంటగట్టారు ఆహార భద్రతా చట్టం ప్రకారం పాలు, నెయ్యి వంటి ఉత్పత్తుల్లో లబ్సా వాడటం పూర్తిగా నిషేధం. ఈ రసాయనం కలిసిన పదార్థాలను తీసుకుంటే జీర్ణాశయం దెబ్బతినడం, పేగులకు గాయాలవ్వడం, కాలేయ వ్యాధులు తలెత్తుతాయి. దీర్ఘకాలంలో ఇది క్యాన్సర్‌కు కూడా దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒక డెయిరీకి వేల కిలోల క్లీనింగ్ రసాయనాలు ఎందుకనే కోణంలో దర్యాప్తు చేసిన సిట్, కల్తీ నెయ్యి తయారీ కోసమే వీటిని వాడినట్లు స్పష్టం చేసింది.


# తిరుపతిలో స్పేస్ సిటీ




తిరుపతి, ఫిబ్రవరి 8, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు త్వరలోనే ప్రారంభం కానుంది. తిరుపతిలో స్పేస్ సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ వద్ద 2800 ఎకరాలలో దీనిని ఏర్పాటు చేయనున్నారు. అయితే స్పేస్ సిటీ ప్రాజెక్టు తొలి విడత ప్రారంభానికి రంగం సిద్ధమైంది. మరో రెండు నెలల్లో తొలివిడతను ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. తొలి విడతలో 570 ఎకరాలలో కోర్ ఇండస్ట్రియల్ యాక్టివిటీస్ మొదలు పెడతారు. ఈ ప్రాజెక్టుతో తిరుపతి జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందని అధికారులు చెప్తున్నారు,.ఏపీలో మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ప్రారంభానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో స్పేస్ సిటీ ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో స్పేస్ సిటీ ప్రాజెక్టు తొలి విడతను త్వరలోనే ఏపీ ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు తెలిసింది. తిరుపతిలో 2800 ఎకరాలలో స్పేస్ సిటీ ప్రాజెక్టు చేపడుతున్నారు. మరో రెండు నెలలలో ఈ ప్రాజెక్టు తొలి విడతను చేపట్టాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. రీసెర్చ్, శాటిలైట్ మ్యానుఫ్యాక్చరింగ్, ఏరోస్పే?స్ టెక్నాలజీ హబ్‌గా ఈ స్పేస్ సిటీని తీర్చిదిద్దాలని ప్రణాళికలు రచిస్తున్నారు.తిరుపతి జిల్లాలోని బుచ్చినాయుడు కండ్రిగ ప్రాంతంలో ఈ మెగా స్పేస్ సిటీ ప్రాజెక్టు చేపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఈ ప్రాజెక్టు చేపడుతున్నారు. స్పేస్ సిటీ ప్రాజెక్టు మొదటి దశలో 570 ఎకరాలలో 140 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో కోర్ ఇండస్ట్రియల్ యాక్టివిటీస్ మొదలు పెడతారు. మిగతా భూమిని రెసిడెన్సియల్ జోన్లు, ఇన్‌స్టి?ట్యూషనల్ క్యాంపస్, లాజిస్టిక్ పార్కులు, అంతర్గత రహదారుల అభివృద్ధి , హైస్పీడ్ ఇంటర్నెట్, కరెంట్, తాగునీటి సరఫరా వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ఉపయోగిస్తారు.మరోవైపు స్పేస్ సిటీలో ఉపగ్రహాల అసెంబ్లింగ్, ఇంటిగ్రేషన్ యూనిట్లు, టెస్టింగ్,క్యాలిబరేషన్ ల్యాబులు, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెంటర్లు వంటివి ఏర్పాటు చేయనున్నాయి. అలాగే స్పేస్ టెక్నాలజీ స్టార్టప్‌ల కోసం ఇంక్యుబేషన్ హబ్స్, డేటా అనలిటిక్స్, డిఫెన్స్ అప్లికేషన్స్, అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్స్ వంటివి అందుబాటులో ఉండనున్నాయి. మరోవైపు స్పేస్ సిటీ నిర్మాణం కోసం ఈ ప్రాంతాన్ని కూడా వ్యూహాత్మకంగా ఎంచుకున్నారు. సమీపంలోనే సతీష్ ధావన్ స్పేస్ సెంటర్, శ్రీహరికోట ఉండటం, తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం దగ్గరలో ఉండటం, జాతీయ రహదారులు, పోర్టులకు సమీపంలో ఉండటం కూడా కలిసి వస్తోంది.ఈ స్పేస్ సిటీ ప్రాజెక్టు ద్వారా ప్రైవేట్ పెట్టుబడులను పెద్దఎత్తున ఆకర్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రాబోయే రోజులలో స్పేస్ సిటీ ద్వారా 25 వేలకోట్ల రూపాయల పెట్టుబడులను స్పేస్ రంగంలో రాబట్టాలని ప్రణాళికలు రచిస్తోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అధికారులు చెప్తున్నారు.స్పేస్ సిటీ ప్రాజెక్టు ద్వారా ఇంజనీర్లు, సైంటిస్టులు, టెక్నీషియన్లు, డేటా స్పెషలిస్టులు, మిగతా అనుబంధ రంగాల వారికి ఉద్యోగాలు లభిస్తాయని చెప్తున్నారు. మరోవైపు స్పేస్ సిటీ ప్రాజెక్టుకు సంబంధించి ప్రాథమిక సర్వేలు, పర్యావరణ అంచనాలు, స్థానికులతో చర్చలు పూర్తి అయ్యాయి. ఈ నేపథ్యంలో మరో రెండు నెలలలో స్పేస్ సిటీ తొలివిడత ప్రారంభిస్తారని సమాచారం.

# రేపు సూర్య దేవాలయంలో దత్తాత్రేయ స్వామికి అనఘాష్టమి వ్రతం..

విభారే న్యూస్ ఫిబ్రవరి 7 కర్నూలు జిల్లా ప్రతినిధి..జయ గురుదత్త శ్రీ గురుదత్తశ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజి దివ్య ఆశీస్సులతో రేపు శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయం నందు సోమవారం ఉదయం 9 గంటలకు శ్రీ దత్తాత్రేయ స్వామి వారికి అనఘాష్టమి



వ్రతం నిర్వహించబడును. ఈ వ్రతం చేసుకోవడం వల్ల గురు బలం పెరుగుతుంది ఉద్యోగము,వివాహము లో ఆటంకాలు తొలుగుతాయి,విద్య బుద్ధులు కలుగుతాయి, వైవాహిక జీవితంలో సమస్యలు తొలిగిపోయి,సకల కష్టాల నుండి విముక్తి పొంది స్వామి వారి అనుగ్రహం కలుగుతుంది. అనఘాష్టమి వ్రతం ప్రధానముగా -1116/సామూహికంగా -200/-సంకల్పము-116/-వివరములకు సంప్రదించగలరు.ప్రద్యుమ్న కుమార్ శర్మ9440616198ఫోన్ పే గూగుల్ పే నెంబరు..8896123777..ఆఫీసు ల్యాండ్ ఫోను నెంబరు..08518-234388

# మహానంది బ్రహ్మోత్సవాలకు సీఎం కు ఆహ్వానం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , ఫిబ్రవరి 07మహానంది క్షేత్రంలో త్వరలో జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారిని, మంత్రివర్యులు నారా లోకేష్ గారిని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి . దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ మహానంది ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్ శ్రీనివాసరెడ్డి సీఎం గారిని మర్యాదపూర్వకంగా కలిశారు.మహానంది క్షేత్రంలో నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల విశేషాలు, ఆలయ ప్రాధాన్యతను సీఎం గారికి వివరించారు. బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వ సహకారం అందించాలని కోరారు.మహానంది దేవస్థానంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల గురించి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సీఎం గారికి వివరించారు. ఆలయ అభివృద్ధికి దాతలు పెద్ద సంఖ్యలో ముందుకు వస్తున్నారని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రభుత్వ సహకారం అవసరమని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వేదపండితులు, ప్రధానార్చకులు పాల్గొని ఆశీర్వచనం చేశారు.

# అన్న క్యాంటీన్‌లో ఆకస్మిక తనిఖీ--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 07-నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను శనివారం మున్సిపల్ కమిషనర్ బి శేషన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగది, భోజనశాల, ఆహార తయారీ విధానం, పరిశుభ్రతను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.అన్న క్యాంటీన్లలో నిర్ణీత సమయానికి నాణ్యమైన భోజనం అందించాలని, శుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కమిషనర్ ఆదేశించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాన్ని ప్రభుత్వం నిర్దేశించిన విధానం ప్రకారం తప్పనిసరిగా అందించాలన్నారు.భోజన నాణ్యతపై లబ్ధిదారులను అడిగి కమిషనర్ తెలుసుకున్నారు. రిజిస్టర్లు, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.ఈ తనిఖీలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహ మూర్తి, శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ, శివ ప్రసాద్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# లడ్డు కల్తీపై జనసేన ఆగ్రహం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 7గత వైసీపీ ప్రభుత్వం భక్తులకు అందించిన లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగించడం మహా అపచారమని మహానంది మండలం జనసేన పార్టీ నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కోట్లాది హిందువుల మనోభావాలపై దాడి చేసిన ఈ చర్యను దేవుడు కూడా క్షమించడని అన్నారు.తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి, అయోధ్య శ్రీరాముడు, శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయాలకు సంబంధించిన లడ్డు ప్రసాదాల తయారీలో రసాయనాలతో కల్తీ నెయ్యి వినియోగించారని ఆరోపించారు. నకిలీ నెయ్యి ద్వారా కోట్లాది లడ్లను భక్తులకు పంపిణీ చేయడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు.ఈ అపచారానికి పాల్పడిన వారిని శిక్షించాలని కోరుతూ ఓంకారం క్షేత్రంలోని కొండపై వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామికి లడ్డు ప్రసాదం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రదక్షిణ చేసి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా చేసిన సంస్థే శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయానికి కూడా నకిలీ నెయ్యి సరఫరా చేసిందని తెలిపారు. శైవ క్షేత్రాన్ని సైతం వదలకుండా అపచారం చేయడం శివ భక్తులను తీవ్ర ఆగ్రహానికి గురి చేస్తోందని అన్నారు.దేవుని పేరుతో అపచారం చేసిన వారు తప్పకుండా శిక్ష అనుభవిస్తారని, తప్పుడు ఆరోపణలు మానుకోవాలని జనసేన నాయకులు హితవు పలికారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కాకర్ల శివ, చక్రపాణి, మురళి, హరిప్రసాద్, చెంచు శీను, సుబ్బరాయుడు, చందు, నాగేశ్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పోటీలు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 07:కర్నూలు జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాల స్వామి వివేకానంద ఆడిటోరియంలో శనివారం తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 140 మంది తైక్వాండో క్రీడాకారులు పాల్గొని వివిధ కేటగిరీల బెల్ట్‌లను సాధించారు. ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎల్ టి చంద్రమౌళి ఆధ్వర్యంలో, మాస్టర్ బాలకృష్ణ నిర్వహణలో, కర్నూలు జిల్లా మాజీ ఒలింపిక్ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన బెల్ట్‌ల ప్రదానోత్సవం జరిగింది. కార్యక్రమానికి రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, చిత్తూరు జిల్లా ఆదాయ పన్ను అధికారి రమణారావు, నంద్యాల జిల్లా క్రీడాభారతి అధ్యక్షులు సుధాకర్ ముఖ్య అతిథులుగా హాజరై క్రీడాకారులకు బెల్ట్‌లు అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.ఆదాయ పన్ను అధికారి రమణారావు మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థులలో ఆత్మస్థైర్యం, శారీరక దారుఢ్యం, మానసిక వికాసం, క్రమశిక్షణ, ఏకాగ్రత పెరుగుతాయని తెలిపారు.క్రీడా భారతి అధ్యక్షులు సుధాకర్ మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ క్రీడలు విద్యార్థులలో ఆత్మవిశ్వా సాన్ని పెంపొంది స్తాయని అన్నారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ తైక్వాండో ఒలింపిక్‌లో గుర్తింపు పొందిన అంతర్జాతీయ క్రీడ అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షల నిర్వహణపై కలెక్టర్ సమీక్ష--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 07:జిల్లాలో ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24 వరకు జరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లాలో 55 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి సంవత్సరం ఇంటర్‌కు 15,443 మంది, రెండవ సంవత్సరం ఇంటర్‌కు 14,424 మంది విద్యార్థులు హాజరుకానుండగా, మొత్తం 29,867 మంది పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణ, తగిన లైటింగ్, తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు.పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేయాలని, ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు డిప్యూటీ తహశీల్దార్లను కేటాయించాలని డీఆర్‌ఓను ఆదేశించారు. ఫస్ట్‌ఎయిడ్ కిట్లు ఏర్పాటు చేయాలని, పారిశుధ్య చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యాలు కల్పించాలని, తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పరీక్షలు ముగిసిన అనంతరం సమాధాన పత్రాలను భద్రతతో పోస్టు కార్యాలయాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ యుగంధర్ బాబు, డీఆర్‌ఓ రాము నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు

# వ్యర్థాల నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు, ఫిబ్రవరి 07:- ఎన్జీటి (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ) నిర్దేశాల ప్రకారం వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించి, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్ లో వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ ప్రక్రియల అంశాల పై కలెక్టర్ కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మున్సిపల్ కమిషనర్ లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, గూడూరు మున్సిపాలిటీ లలో రోజుకు ఎన్ని మెట్రిక్ టన్నులు వ్యర్థాలు సేకరించారు, సేకరించిన వ్యర్థాలలో ఎన్ని టన్నులు తడి, పొడి చెత్త ఉంది అని వివరాలను అడిగి తెలుసుకున్నారు. తడి చెత్తను విండ్రో కంపోస్టింగ్ పద్ధతి ద్వారా వ్యవసాయ ఎరువుగా మార్చాలన్నారు. పొడి చెత్తలోని ప్లాస్టిక్, గాజు, మరియు పేపర్ వంటి వస్తువులను వేరు చేసి రీసైక్లింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. డంపింగ్ యార్డ్ లలో పేరుకుపోయి ఉన్న వ్యర్థాలను క్లియర్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఫ్యామిలీ యూనిఫైడ్ సర్వే లో పురోగతి తీసుకొని రావాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు. సమావేశంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, వీడియో కాన్ఫరెన్స్ లో ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగి రెడ్డి, ఆదోని మున్సిపల్ కమిషనర్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 9వ తేదీ ( సోమవారం) ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

(పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం అర్జీల పరిష్కారం సమాచారం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి కనుక్కోవచ్చు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరికర్నూలు , ఫిబ్రవరి 7 :- ఫిబ్రవరి నెల 9 వ తేదీ సోమవారం ఉదయం 9-30 గంటలకు కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అర్జీల పరిష్కారం సమాచారం కోసం 1100 కు ఫోన్ చేయవచ్చుఅర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు..

## ముగిసిన అయిదు రోజుల రెసిడెన్షియల్ కేజీబీవీ ప్రిన్సిపాళ్ల మరియు వార్డెన్ల సాధికారతకు శిక్షణా కార్యక్రమం

మినిస్టరీ ఆఫ్ ఎడ్యుకేషన్ ( యమ్. ఓ. ఈ) నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ మరియు అడ్మినిస్ట్రేషన్ (యన్. ఐ. ఈ. పి. ఏ ) సమగ్ర శిక్ష వారిచే సత్య సాయి జిల్లా కేజీబీవీ ప్రిన్సిపాల్స్ మరియు హాస్టల్ వార్డెన్స్‌కు విజయభారతి డి.ఎడ్ కళాశాల బుక్కరాయసముద్రం లో నిర్వహించిన 5 రోజుల రెసిడెన్షియల్ ట్రైనింగ్ నేటితో ముగిసింది, ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్. వెంకటేశ్వర్లు డిప్యూటీ డైరెక్టర్ డిపార్ట్మెంట్ ఆఫ్ అడల్ట్ ఎడ్యుకేషన్ ఉమ్మడి జిల్లా,సి. ఉషారాణి సూపర్వైజర్ అడల్ట్ ఎడ్యుకేషన్ ఉమ్మడి జిల్లా,సి. శివ లత డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ కౌన్సిలర్ సత్యసాయి జిల్లా లు హాజరుకావడం జరిగింది. అయిదు రోజుల ట్రైనింగ్ లో నేర్చుకున్న విషయాలను తప్పక విద్యార్థుల్లో మార్పులు తీసుకొని రావడానికి ఉపయోగ పడుతుందని ప్రతి కేజీబీవీ ప్రిన్సిపల్ మరియు వార్డెన్లు




విద్యార్థులను తల్లితండ్రుల మాదిరిగా చూసుకోవాలని, గృహ వాతావరణాన్ని కల్పించాలని సత్య సాయి జిల్లా ఏజీసీడీఓ జి. అనిత పేర్కొన్నారు. విద్యార్థుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ వారికి ఏమి లోటు రాకుండా చూస్కోవాలి, విద్యార్థుల సేఫ్టీ మరియు సెక్యూరిటీ మన రెసిడెన్షియల్ పాఠశాలల్లో చాలా ముఖ్యమని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమానికి మాస్టర్ ట్రైనీస్ గా వచ్చిన పల్నాడు జెసిడిఓ రేవతి, ఉషారాణి రాయచోటి డైట్ లెక్చరర్, రాధిక డైట్ లెక్చరర్ బుక్కపట్నం, మాలతీదేవి డైట్ లెక్చరర్ బుక్కపట్నం, కే కుమార్ డిస్ట్రిక్ట్ కెరియర్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ సమగ్ర శిక్ష ఎన్నో విషయాలు ట్రైనింగ్ కు వచ్చిన కేజీబీవీ ప్రిన్సిపాల్స్ యు మరియు వార్డెన్లకు దిశా నిర్దేశం చేయడం జరిగింది, అందులో భాగంగానే ట్రైనింగ్ దిగ్విజయంగా పూర్తి చేసిన వారందరికీ ఐదవ రోజు ముగింపు కార్యక్రమానికి వచ్చిన చీఫ్ గెస్ట్ లతో సర్టిఫికెట్లను ప్రధానం చేయడం జరిగినది, ఏది ఏమైనా పటికి ఇంతటి ఆహ్లాదకర వాతావరణంలో ట్రైనింగు ను ఆర్గనైజేషన్ చేసిన మినిస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్, యన్. ఐ. ఇ. పి. ఏ (నిపా) మరియు సమగ్ర శిక్షకు ప్రత్యేక ధన్యవాదములు, ఈ ఐదు రోజుల రెసిడెన్షియల్ ట్రైనింగ్ కేజీబీవీ ప్రిన్సిపాల్ మరియు హాస్టల్ వార్డెన్స్ ల నిబద్ధతను, మరింత క్రమశిక్షణతో కూడిన కూడిన విద్యార్థులను తయారు చేయడానికి, వృత్తి లో ఎదురయ్యే సమస్య సమర్థవంతంగా ఎదుర్కోవడానికి దోహదపడుతుంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**